క్లుప్తంగా

సానిటేషన్ సిబ్బందికి వేతనాలివ్వాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఆస్పత్రిలోని శానిటేషన్ సిబ్బందికి ఆర్నెళ్లుగా వేతనాలు రావడం లేదని తమకు వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పీవీ నర్సింహారావుకు ఘననివాళి



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు శుక్రవారం దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావుకు నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం పీవీ నర్సింహారావుకు భారతరత్న అవార్డును ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్ఎన్‌రెడ్డి, బాలకిషన్, సతీష్ తదితరులున్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం



బిచ్కుంద(జుక్కల్):మండలంలోని రాజుల్లాలో శుక్రవారం జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) శిబిరంలో భాగంగా పారిశుధ్య పనులు చేశారు. ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి సంజీవ్ కుమార్ వలంటీర్లు పాల్గొన్నారు.

కొయ్యగుట్ట తండాలో..

బాన్సువాడ రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల కార్యాలయ సూపరింటెండెంట్ ముజాహిద్ అన్నారు. శుక్రవారం కొయ్యగుట్టతండాలో శశాంక్ డిగ్రీకళాశాల బాన్సువాడ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. జీపీ కార్యదర్శి రాహేలాబేగం, తారూనాయక్ తదితరులున్నారు.

టెక్రియాల్‌లో..

కామారెడ్డి అర్బన్ : వారం రోజులుగా కామారెడ్డి పట్టణం టెక్రియాల్‌లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారం ముగిసింది.

రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేటలోని వేణుగోపాల స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డును ఆక్రమిస్తున్న చేపట్టిన నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్తులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి భూమేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఒకరు తన పాత ఇంటిని కూల్చి 3 ఫీట్లు రోడ్డుకు జరిగి నూతనంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారని, ఆలయానికి వెళ్లేవారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత ప్రతిమ, దివ్యసమాధి, పాదుకలను రకరకాల పూలతో అలంకరించారు. అన్నదానం చేశారు.

పరీక్షకు గంట ముందుగా సెంటర్‌కు చేరుకోవాలి

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 11న ఉదయం 9గంటలకే సెంటర్‌కు చేరుకోవాలని కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ శోభారాణి సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అర్హత పరీక్షలో సాధించిన మార్కులతో పాటు రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.



నాగమడుగు వద్ద మంజీర తీరాన స్నానాలాచరిస్తున్న భక్తులు



గోలిలింగాల శివారులోని మంజీరనదిలో..



లక్ష్మీదేవునిపల్లిలో నర్సింహస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



సంతాయిపేట్ శివారులోని భీమేశ్వరాలయం వద్ద భక్తుల బారులు

భక్తిశ్రద్ధలతో మాఘ అమావాస్య

- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- మంజీరలో స్నానాలు
- భారీ ఎత్తున అన్నదానాలు



దోమకొండలో కటికం మల్లేశుని ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ తదితరులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలో శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సంతాయిపేట్ శివారులోని భీమేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఉత్తరం నుంచి దక్షిణం వైపు ప్రవహిస్తున్న గంగానదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 5 లక్షల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అన్నదానం చేశారు. సైంటిస్ట్ పైడిఎల్లారెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయం వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపారు. తాడ్వాయి, ఎర్రపహాడ్, చంద్రాపూర్, చిట్యాల, కాలోజివాడి, సంగోజివాడి, దేమికలాన్, బ్రాహ్మణపల్లి శివాలయాలలో కూడా భక్తులు శుక్రవారం పూజలు చేశారు.





దగ్గిలోని ప్రభుస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు సన్మానం, వీర హనుమాన్ ఆలయంలో పూజలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని గోలిలింగాల శివారులో ఉన్న స్వయంభు లింగేశ్వర దేవాలయంలో ఘనంగా మాఘ అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశివారులో మంజీరనదిలో స్నానాలాచరించారు. దీంతోపాటు నది ఒడ్డున ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని దగ్గిలో ప్రభు స్వామి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుందరమ్మ, మాజీ ఉప సర్పంచ్ పద్మ లింగారెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో మాఘ అమావాస్య వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వమించారు. పెద్ద చెరువులో స్నానాలను ఆచరించారు. శివాలయంలో పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు.

భిక్కనూరు : మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో మాఘం అమవాస్య సందర్భంగా శుక్రవారం నర్సింహస్వామి జాతరను నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నర్సింహస్వామికి అభిషేకాలు నిర్వహించారు.

దోమకొండ : మండల కేంద్రంలోని గుండ్ల చెరువు వద్ద కటికం మల్లేశుని ఆలయంలో మాఘ అమావాస్య సందర్భంగా జాతర నిర్వహించారు. శివునికి అభిషేకాలు చేశారు. జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, ఆలయ కమిటీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట గ్రామ శివారులోని నాగమడుగు మంజీరా నది తీరం భక్తులతో కిక్కిరిసింది. పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మంజీరాలో స్నానాలాచరించారు. శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు.అచ్చంపేట గ్రామ భజన మండలి ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట గ్రామ పెద్దలు సత్యనారాయణ,రమేష్, లక్ష్మణ్‌స్వామి, రాములు తదితరులు ఉన్నారు.

భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామం శివారులోని దేవేంద్రుని గుట్ట వద్ద శుక్రవారం నిర్వహించిన జాతరకు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోనేరులో స్నానాలాచరించారు.

రామారెడ్డి (ఎల్లారెడ్డి) : ప్రముఖ పుణ్యక్షేత్రం బుగ్గ రామలింగేశ్వరుడి ఆలయంలో నాగమ్మ వాస్తు సందర్భంగా పుణ్య స్నానాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్నానాల ఏర్పాటుకు వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. సంవత్సర కాలం పాటు నిత్య అన్నదానం జరిగే బుగ్గ రామలింగేశ్వరుడు ఆలయంలో మాఘమావస్తే మాత్రం అన్నదానం నిర్వహించకుండా భక్తులే వనభోజనాలకు రావడం ఆలయ ప్రత్యేకత. వేల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మాచారెడ్డి : మండలంలోని మాచారెడ్డి చౌరస్తాలోని శ్రీ వీర హన్మాన్ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మాఘమాస జాతరను ఘనంగా నిర్వహించారు. మాచారెడ్డి గ్రామస్తులు భజన గీతాలు అందరినీ అలరించాయి.

రాజంపేట : రాజంపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో మాఘం అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. దుర్గమ్మ భక్తులు ఊరేగింపుగా వెళ్ళి బోనాలను సమర్పించారు. అనంతరం ఎండ్ల ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు.



పెద్దమల్లారెడ్డి దేవేంద్రుడి గుట్టవద్ద భక్తుల బారులు



ఎల్లారెడ్డిలోని శివాలయంలో అన్నదానం



చిట్యాలలోని శ్రీరాజరాజేశ్వరాలయం వద్ద..



సదాశివనగర్ దగ్గి ప్రభుస్వామి ఆలయం వద్ద..

పీఆర్‌టీయూ సేవలు అభినందనీయం



పీఆర్‌టీయూ ప్రతినిధులను అభినందిస్తున్న కలెక్టర్

కామారెడ్డి అర్బన్ : ఉపాధ్యాయులు తమ వృత్తి నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో భాగంగా ఆయన మాట్లాడారు. పీఆర్‌టీయూ భవన్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించగా సుమారు 150 మంది టీచర్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్ రాజు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి, కార్యదర్శి కుషాల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, కార్యదర్శి బి.రఘుకుమార్ తదితరులున్నారు.

సమ్మె నోటీసులు అందజేత



నస్రుల్లాబాద్ పంచాయతీ సిబ్బందికి నోటీసు అందిస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మంచి నీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ సంస్థ నుండి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. జీపీ సిబ్బంది ఇంటింటికీ సరఫరా అయ్యే నీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. జీపీ కార్యదర్శి రాజేష్, కోరోబార్ రతన్, మిషన్ భగీరథ సిబ్బంది ఉన్నారు.

డీఈవో, ఎంఈవోలను సస్పెండ్ చేయాలి

కామారెడ్డి టౌన్: నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా డీఈవో, ఎంఈవోలను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల జేఏసి నాయకులు ఆజాద్, సందీప్, అరుణ్ తదితరులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గుర్తింపు లేకుండా కొనసాగుతున్న శ్రీ చైతన్య పాఠశాల గదులను ఎంఈవో ఎల్లయ్య సీజ్ చేసారని, మరుసటి రోజు నుంచి సీజ్‌ను తొలగించి తరగతులను కొనసాగిస్తున్న డీఈవో, ఎంఈవోలు పట్టించుకోవడం లేరన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా గంగమ్మ కల్యాణం



భిక్కనూరు : మండలంలోని జగంపల్లిలో చంద్రమౌళీశ్వర గంగమ్మ కల్యాణంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో తెప్పోత్సవం నిర్వహించారు. ప్రసాదం పంపిణీ చేశారు.

జాతరలో పోటెత్తిన భక్తులు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని బొమ్మన్‌దేవ్ పల్లిలో అల్లమా ప్రభు జాతరలో శుక్రవారం భక్తులు పోటెత్తారు. మూడు కొండల పై నిలిచిన ఆత్మ లింగాన్ని దర్శించుకోవడానికి కాలి బాటన ప్రజలు వెళ్లారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు.

సమాచారం..

నేడు రోడ్డు భద్రత మాసోత్సవం

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ముత్యం రాఘవులు ఫంక్షన్ హాల్ లో రోడ్డు భద్రత మాసోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు.

ఇంటర్వ్యూలు..

మాచారెడ్డి : నిరుద్యోగ యువతీ యువకుల కోసం మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాల కోసం శనివారం కామారెడ్డి వెలమ ఫంక్షన్ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 10వ తరగతి, డిగ్రీ ఆ పై చదువులు చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలన్నారు.

రేపు గురుకుల కళాశాలలో ప్రవేశ పరీక్ష

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల గురుకుల కళాశాలలో ఆదివారం 5వ తరగతిలో చేరబోయే విద్యార్థుల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రవేశ పరీక్ష ఏర్పాట్లపై రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకుపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

22లోగా దరఖాస్తు చేసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో కొత్తగా ప్రవేశాలు, 7,8,9,10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భానుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్-9న ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో దళిత యువతితో అమానవీయంగా ప్రవర్తించిన నిందితులను కఠినంగా శిక్షించాలని కామారెడ్డి దళిత, ప్రజా,విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వారు నిరసన వ్యక్తం చేశారు.డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్క బాబు, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు బట్టెంకి బాలరాజు, బీవీఎం విఠల్, బామ్‌సెఫ్ జిల్లా అధ్యక్షుడు సాయి గౌతమ్, నాయకులు స్వామి, నారాయణ పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి డిమాండ్ చేశారు.

మాచారెడ్డి : మండల కేంద్రంలో జరిగిన అమానవీయ సంఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత, గిరిజన సంఘాల నేతలు రవి, హెమ్లానాయక్, రామచంద్రం, కృపానందం డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న స్పెషల్‌డ్రైవ్

ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని సోమర్యాగడి తండాలో పైపు లీకేజీ పనులను స్పెషల్ ఆఫీసర్ వెంకటేశం శుక్రవారం పరిశీలించారు. నిరంతరం నీటి సరఫరా చేయాలని జీపీ కార్యదర్శి వెంకట్‌రాములకు సూచించారు.

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేకాధికారులు పారిశుధ్య పనులు చేపడ్తున్నారు. వీధుల్లో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. మురికికాలువలు శుభ్రం చేశారు. తాగునీటి పైపులకు మరమ్మతులు చేశారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం శానిటైజేషన్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాలు కొనసాగాయి. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా చాలా రోజులుగా నిల్వ ఉన్న నీటిని పారపోయించారు. మండలంలోని రాఘవపల్లిలో ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో రఘు, జీపీ ప్రత్యేకాధికారి వినోద్ మురికికాలువలను శుభ్రం చేయించారు. వాటరింగ్ డేను నిర్వహించారు. మండలంలోని చీనూర్, మాల్తుమ్మెదలో ఎంపీవో శ్రీనివాస్ మురికికాలువలను శుభ్రం చేయించారు.

పిట్లం(జుక్కల్): ప్రజలు మురికికాలువలలో చెత్త చెదారం వేయరాదని, తమకిచ్చిన డస్ట్‌బిన్‌లో వేసుకోవాలని జీపీ ప్రత్యేకాధికారిణి బ్రహ్మం పేర్కొన్నారు. శుక్రవారం డ్రైనేజీలను శుభ్రం చేయించారు. జీపీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని కొమలంచలో పరిశుభ్రత పనులను శుక్రవారం మండల జీపీ అధికారి అబ్బాగౌడ్ పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వర్ణలత, మిషన్ భగీరథ ఏఈఈ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కంచర్ల లింగం

కామారెడ్డి టౌన్ : చాంబర్ ఆఫ్ కామర్స్ కామారెడ్డి కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ కొనసాగింది. అధ్యక్షుడిగా కంచర్ల లింగం, ప్రధాన కార్యదర్శిగా సుకుమార్‌గౌడ్, కోశాధికారిగా నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నికల కమిటీ కన్వీనర్ శనిశెట్టి గౌరి శంకర్, కో కన్వీనర్ రవీందర్ నూతన కమిటిని ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు గజవాడ రవి, కైలాస్ సంతోష్, బొమ్మ రమేష్, రేణికింది తులసీదాస్, మోహన్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' వివరాల నమోదు

కామారెడ్డి రూరల్ : మండలంలోని చిన్నమల్లారెడ్డిలో చేపడుతున్న మహాలక్ష్మి పథకం సర్వేను ఎంపీవో మలహరి శుక్రవారం పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో గ్యాస్ కనెక్షన్ వివరాలు సరిగ్గా రాయకపోవడంతో తిరిగి సేకరిస్తున్నారు. జీపీ కార్యదర్శి మౌనిక, కారోబార్ శ్రీనివాస్ ఉన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. శుక్రవారం మండలంలోని మాచాపూర్ జడ్పీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలకు ఇష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటుపై హర్షం

ఎల్లారెడ్డి : మండలంలోని సాతెల్లిలో శుక్రవారం రేషన్ దుకాణం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు విన్నవించడంతో రేషన్ దుకాణం ఏర్పటైందన్నారు.

ఉచిత కంటివైద్యశిబిరం

పిట్లం(జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, కోశాధికారి కాశిరెడ్డి, వైద్యులు శివకుమార్, సమద్, సిబ్బంది పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం వికలాంగ విద్యార్థుల కోసం ఏంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ పాల్గొన్నారు.

కృష్ణాజీవాడి పాఠశాలలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎనిమియా ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 8, 9, 10తరగతిలో చదువుతున్న విద్యార్థులందరికి వైద్య పరీక్షలు చేశారు. హెచ్ఎం రామస్వామి, డాక్టర్ హరీష్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీ మాజీ పాలకవర్గానికి సన్మానం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చిట్యాల జీపీ మాజీ పాలక వర్గాన్ని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ సర్పంచ్ మ్యాడం కవిత, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు.

మండల ఓటర్ల తుది జాబితా విడుదల

రాజంపేట : రాబోయే ఎంపీ ఎలక్షన్లకు మండల ఓటర్ల తుది జాబితా సిద్ధం చేసినట్లు మండల తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. రాజంపేట మండలంలో 08.02.2024 నాటికి కామారెడ్డి అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించిన పోలింగ్ స్టేషన్ల (09) పరిధిలో మగ ఓటర్లు 4462, ఆడ ఓటర్లు 4939, మొత్తం 9,401 ఓటర్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 24 పోలింగ్ స్టేషన్లకు గాను మగ ఓటర్లు 10,584, ఆడ ఓటర్లు 11,444, మొత్తం 22,028 ఓటర్లు ఉన్నారన్నారు.

నియామకం

కామారెడ్డి టౌన్/నస్రుల్లాబాద్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం కామారెడ్డి జిల్లా ప్రధాన కా ర్యదర్శిగా ఇసాయిపేట నరేష్, బాన్సువాడ నియోజక వర్గం ఇన్‌చార్జీగా నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామ యువకుడు కర్రె గడ్డం భాస్కర్ గౌడ్ నియమించారు. శుక్రవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ నియామకపత్రాన్ని అందజేశారు.